ఎంత విశాల హృదయుడవుతేనేం! తక్కిన ఉన్నత లక్షణాల కంటె కులం అధికతమమైంది... వాళ్లకి!— లోకోద్ధార కుల్లా మాట్లాడుతారుమల్లా. అందుకే మనసులోనే కుళ్ళి, ఆశయాన్ని స్వహస్తంతోనే తుంచేసుకొని అజ్ఞాతపు జీవితాన్ని గడపడానికి సిద్ధమవ వల్సి వొచ్చింది మా నాన్న.

"మధ్య ఇన్నాళ్ళు జరిగినా నా స్థితి కూడా అదే దారిలో నడిచేలా వుంది. ఈ వున్నత కులస్థుల మనుకునే హృదయ శూన్యులు కొంచపర్చినప్పుడు ఆత్మహత్య చేసుకుందామా అనిపిస్తుంది" అని ముగించాడు కేశవరావు...ఇది జరిగిన రొండేళ్లకే తను బి. ఎ. చదువుతున్నప్పుడు, తన్ని ప్రేమించిన బ్రాహ్మణుల అమ్మాయితో వివాహం జరిగి, తన నమ్మకాన్ని మార్చకపోతే, ఇంకా "చరిత్ర పునరావృత మౌతుం"దనే నమ్ముతూ వుండును అతను.

అతని పెళ్లికినే పంపిన సందేశం: "చరిత్ర పునరావృతమవదు" అని. ★

## కుమారసంభవమ్

"ఛా! ఇంకా మాన్లేదూ! నేను చెప్పానుగా. ఒక్క కుమార సంభవమైతే వాడి తిక్క అదే తిరుగుతుంది. దీనికి ఏడుపెందుకే! లే, వాడు చూస్తే బాగుండదు" అంది రత్తమ్మ గారు.

ఈ అనునయంతో శారదలేచి కళ్లు తుడుచుకుంది. వంటింట్లోకి వెళ్లి పీట వేసి వడ్డించ సాగింది. భర్త రామం వచ్చి

నిశ్శబ్దంగా కూచుని తినసాగాడు.

అసలు రోజూ రాత్రి 8 గంటలకే రత్తమ్మగారు ఫల హారం కానిచ్చి. తన పక్కమీదికి చేరేది. తర్వాత మేనల్లుడి భార్యతో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ సైమరచేది.

ఆవేళ కూడా అల్లాగే పని పూర్తిచేసికొని వచ్చేటప్ప టికి, శారద తన గదిలోకి వెళ్లింది. ఆవిడ ఎంత పిల్చినా రాలేదు. "ఇదేంచోద్యమమ్మా! ఎనిమిదైనా కాలేదు. అప్పుడే నిద్దరా?" అంటూ ఆగదిలోకి వెళ్లింది రత్తమ్మగారు.

శారద వెక్కివెక్కి దుఃఖించడాన్ని గమనించింది. ఎందుకో తెల్సుకోలేకపోయింది.

"ఇదేంపనే, తీరికూచుని?" అంది. ఆవిడ రాకను గమ నించి, ఆవిడ మాటల్ని విన్నాక, పొర్లి పొర్లి వస్తున్న శారద దుఃఖం యేడుపుగా మారిపోయింది.

"చూడండి, పిన్నిగారూ!" అంటూ ఆవిడ మీదపడి బేరుమంది శారద.

"ఏమిటే సంగతీ? అసలు విషయం చెప్పి మరీ గొడవ చెయ్యి" అంది రత్తమ్మగారు.

శారదకి నోటమాట రాలేదు. మనస్సెంతో బాధపడు తూ ఉంది. ఏ విధంగా చెప్పగలదు? సిగ్గనేది కూడా కొంత అడ్డు తగిలింది.

ఇంతకూ అసలు సంగతి ఏమంటే రామానికి శారద కూ పెళ్ళై నాలుగేళ్లయింది. పెళ్లయిన రెండేళ్ల వరకూ రామం శారద నీడలా ఉండేవాడు. చూసిన వాళ్ళంతా ఇల్లాంటి ప్రేమికులు వున్నారా! అనుకునే వారు.

కాని... తర్వాత రెండేళ్లలోనే అతనిలో చెప్పలేనంత మార్పు వొచ్చింది. శారదతో మాట్లాడ్డం— ఏదో సాంసారిక విషయాల్లో తప్పిస్తే— అపురూపమై పోయింది. క్లబ్ అలవాటు చేసుకుని ఎక్కువ కాలాన్ని అక్కడే గడప సాగాడు. శారదకిదంతా అగమ్య గోచరమైంది. ఎందుకు తన భర్తలో యింత వ్యతిరేకభావ మొచ్చింది? మొదట ఏవైనా దురలవాట్లను లోబడ్డాడేమో ననిపించింది శారదకు. కాని దాంట్లో నమ్మకం కుదరలేదు. కొన్నాళ్ళకన్నా నిజం బయటపడక పోతుందా? అనుకుంది. ఏమీ తెలియలేదు.

పోనీ తన ఆకర్షణలో ఏదైనా మార్పు వచ్చిందా అంటే అదీలేదు. చాలమంది భార్యలు— తను ఎరుగును— తమ భర్తలేకదా అని వాళ్లని ఆకర్షించడానికి ప్రయత్నించక కొత్తదనాన్ని నిలుపుకోక, వాళ్ల ప్రేమకి దూరం అవుతారు. తను అలా చెయ్యడం లేదే?

కాని కారణం, ఎంత ఆలోచించినా, కొరకబడలేదు.

"ఆయన నాతో ...... మాట్లాడ్డమే లేదు. నన్ను నిర్లక్ష్యం చేసి అసలు లెక్క లేనట్టు వుంటున్నారు." అని మాత్రం బలవంతాన అనగలిగింది; తక్కిన భావాలు దుఃఖ తరగంలో కలిసిపోయాయి.

"ఓసి వెర్రిదానా! దీనికేనా అంత యేడుపు! ఛా! వాడల్లాంటివాడు కాదే?" అంది రత్తమ్మ.

మరింకెలాంటివాడు? ఈ నిర్లక్ష్యమంతా ఎందుకు? ఎన్నో ప్రశ్నలు శారదలో వుదయించాయి. దుఃఖం మాత్రం తగ్గలేదు. రత్తమ్మగారు "నేచెబుతాలే! ఏడవకు" అంటూ

ఓదార్చింది.

"నీ పద్ధతేం బాగులేదురా! రేపట్నించీ, ఆ క్లబ్ లూ, గ్లిబ్బులూ మానెయ్యి. నీ ఈడు వాళ్లంతా ఇల్లానే వుంటున్నారా? ఇల్లు, ఇల్లాలూ...ఇవేం చూసుకో నక్కర్లే?" నెమ్మదిగా అతను అన్నం తింటుంటే మందలించింది రత్తమ్మగారు, ఇంటికి పెద్దదిక్కు తనేనన్న స్వాతిశయంతో.

రామూకి కిదేం అర్థమవలేదు. ఓసారి భార్యకేసి చూశాడు, పరిశోధిస్తున్నట్టు. కాని శారద తీక్షణ ముఖంలో అతనికే కారణమూ కనపడలేదు.

"అల్లాగే అత్తయ్యా! కాని సాయంత్రం పూట ఏమీ తోచొద్దూ? అక్కడికిపోతే కాస్త నలుగురు మిత్రులూ కలుస్తారేమోనని" అన్నాడు గొణుగుతూనే.

రత్తమ్మ తృప్తిపడింది. కాని శారదకిది నోటి చివరి మాటే ననిపించింది. తను ఎన్నోసార్లు ప్రాధేయ పడింది. కాని పడకగది వాగ్దానాలన్నీ—వ్యర్థమయ్యాయి. కాని మేనత్త మాట? ఏమో ఏమవుతుందో?

రామూన్ని మేనత్తే పెంచి, పెద్దచేసింది. అందుకని అతనికి ఆవిడమీద భక్తిగౌరవా లున్నాయి. లేకపోతే తల్లిదండ్రుల్ని చిన్నతనంలోనే పోగొట్టుకున్న రామూకి దిక్కూదక్షతా లేక పోవును. అతని కృతజ్ఞతే ఆవిడ మాటల్ని జవదాటకండా చేసేది.

రాత్రి గదిలో అడిగాడు: "అత్తయ్యతో యేం చెప్పావ్?"

శారద "ఏమీలేదు" అంది.

"సరేలే" అతనేం మాట్లాడలేదు.

రామం ప్రకృతిని చదవడం, వ్రాయడం కష్టం. అత నలా ఎందుకున్నాడు అంటే మీరూ చెప్పలేక పోవచ్చును, యెంత పరిచయమున్నా. శారద మీద ప్రేమ పోయిందా అంటే మామూలు భార్యా భర్తల మధ్య వుండే ప్రేమ లేక పోలేదు. కాని ఆ నిర్లక్ష్యానికి కారణం అవగతం కాదు. మొదటి రోజుల్లో ఎప్పుడూ శారద సరసనే వుండేవాడు. రెండు మూడు సార్లుగా వును రత్తమ్మ వారించింది కూడా! అది అతను అప్పట్లో వినలేదు.

ప్రేమ పేరుతో ఆడవాళ్ల వద్ద కూచోడంకన్న ఎక్కువైన ఇతర జీవితపు విలువలు గ్రహించాడో ఏమో శారదతో కలిసికట్టుతనం తగ్గింది. ఈ మార్పు మాత్రం శారదని చాలా బాధించింది. ఓర్పు లేకుండా చేసింది.

రత్తమ్మగారు 'కుమార సంభవమైతే వాడి తిక్క అదే తిరుగుతుంది' అన్న మాటలు శారదకి మనశ్శాంతి కలిగించాయి.

అప్పుడే పెళ్ళై 4 ఏళ్ళు అయింది. ఇంతవరకూ లేని సంతానం ఇప్పుడు కలుగుతుందా? ఏమో? వెయ్యి దేవుళ్ళని ప్రార్థించింది— సంతనాన్ని ప్రసాదించమని!

పురుషుల్ని సంసారంతోనూ భార్యతోనూ శాశ్వతం గా బంధించి వుంచే గొప్ప సాధనం సంతానం.

శారద కోరిక ఫలించింది. కొద్ది రోజుల్లోనే నెల తప్పిం ది. మనస్సు కుదుటపడింది. తన భర్తని తన బిడ్డ సహాయం తో తిరిగి తన వాణ్నిగా చేసుకోవచ్చు. ఎన్నో ఆశాసౌధా

ల్ని నిర్మించుకొంది.

ఒకరోజు రత్తమ్మగారు అంది. "ఒరేయ్! నేను మను మడ్ని యెత్తుకోబోతున్నాను."

రామం ఆశ్చర్యంగా చూశాడు.

రాత్రి గదిలో "ఇన్నాళ్ళూ చెప్పలేదేం?" అన్నాడు.

శారద సిగ్గుగా నవ్వింది. మనస్సు సంతోషంతో గెంతింది. భర్త యెంతో ప్రేమతో అడిగాడు. ఎన్నాళ్లకి ఇంతసాదరపూర్వకవాక్యాన్నివింది! 'పిన్నిగారు' చెప్పిందినిజమే!

కుమారుడు కలిగేడు.

మూడో నెల్లో రామం బారసాల చేసుకుని అత్తారింటి నుంచి భార్యనీ, పుత్రుణ్నీ తీసుకు వచ్చాడు. శారదకి తన జీవితంలో కష్టాలన్నీ గట్టెక్కినట్టనిపించింది. తనకి కావల్సింది తన భర్త ప్రేమ! అది ఇక ముందు పొందకుండా యెలా వుండగలదు?

ఆఫీసుటైంలో ఎలా వుంటాడో గాని రామం కొడుకునివిడిచి క్షణం వుండడం లేదు. శారద పని పాలివ్వడం మట్టుకు. అతని కాలక్షేపమంతా కొడుకుతోనే. జీతం రాగానే వాడికోసం యెన్నో రంగు రంగుల ఆటబొమ్మలు, అవీ తెచ్చేవాడు.

ఒకనాడు ఆఫీసర్ ఏదో అర్జంటుపని అని అంటగట్టాడు. ఇంటివద్ద చేద్దామని తీసుకొచ్చి, పిల్లవాడితో ఆటలతో మర్చిపోయాడు. మర్నాడు ఆఫీసర్ "మీరు 24 గంటలూ పితృత్వానాకర్లే" అన్నాడట.

పదినెల్లు గడిచాయి. కొడుకు సాధనంగా భర్తని

ఇంట్లో కష్టసుఖాలో గలిగినందుకు సంతోషించింది శారద. రత్తమ్మగారు కూడా ఒకటి రెండుసార్లు గావును "నేచెప్పలే" అన్నట్టు సగర్వంగా దృక్కుల్ని ప్రసరిస్తూ, నవ్వుగా చూసేం.

ఒకనాడు రాత్రి శారద తొరగా పని ముగించుకొని తన గదిలో కొచ్చింది. రాము పిల్లవాడు కేరంతాలు కొడు తుంటే ఆనందిస్తూ, ఆడిస్తున్నాడు. శారద అలా అరగంట నించుంది. అయినా అతని వీక్షణాలావిడపై పడ లేదు. శార దకు యెందుకనో దుఃఖం పొర్లుకొచ్చింది.

కుర్చీపై చతికిలపడి, పమిటచెంగుతో కన్నీళ్లు తుడుచు కుంది. అవును— కుమారసంభవమైంది! కాని ఏం లాభం వొరిగింది? తన భర్త ఇంటిపట్టునే వుంటున్నాడు. తనకే మొలి కింది? తనతో ఎప్పుడైనా, ఒక్కరోజైనా సాదరంగా మాట్లాడ లేదే? తన ఆశలన్నీ అడియాస లైనట్టు తోచింది. అన్నాళ్ళూ కొడుకుమీదపెట్టుకున్న ఆశలన్నీ అడుగంటాయి. కొడుకు పుట్టిన ప్రయోజనం నిష్ప్రయోజనమే! ఇదివరకు తన భర్త కొన్నాళ్లకైనా తనవాడు కాకపోడనే ధైర్యం వుండేది. ఇప్పుడది కాస్తా అడుగంటి నట్టనిపించింది. దుఃఖం పొర్లిపొర్లి రాసాగింది.

గబగబా వెళ్లి రత్తమ్మ మంచం దగ్గర కూచొని 'పిన్ని గారూ!' అని యేడవ సాగింది. రత్తమ్మ మగత నిద్రలో లేస్తూ తెల్లబోయి, "ఏమే, ఇదేమిటే, ఏం కర్మ కాలిందే" అంటూ చూడసాగింది.